
పెద్ద చదువులు చదువుకోవాలని ఆరాటపడిన ఆ కుర్రవాడి ఆశ ఫలించిందా?

# అయ్యా! సదూకుంటాను




"అయ్యా! నాను సదూకుంటానయ్యా!"

అసిరిగాడు అమాయకంగా అడిగాడు. పొగాకు కాడల్ని దులుపుతున్న ఎరకయ్య విసురుగా చూశాడు. కళ్లల్లో కోపం ప్రత్యక్షమైంది.

జవాబేమీ లేకుండా పనిలో జారిపోయాడు.

"అయ్యా!" మళ్లీ అందుకున్నాడు.

"ఏందిరా" ఎరకయ్య కోపంగా అడిగాడు.

"నాను బళ్లోకెళ్లి సదూకుంటానయ్యా!"

ఏ సమాధానం చెప్పగలనని ఎరకయ్య ఆలోచనలో పడ్డాడు. గత వారం పదిరోజులుగా కొడుకు పెడుతున్న పోరు మర్చిపోలేకుండా వున్నాడు. "ఒరేయ్ అసిరీ! మనకెందుకురా సదువు?" అన్నాడు.


"నాకు సదూకోవాలనుందయ్యా!"

తన ముత్తాతకి చదువులేదు. తాతకి సదువులేదని తన బాబు సదూకోలేదు. తనకి అక్షరమ్ముక్కలు తెలీవు. అందుకే అన్నాడు "ఎందుకుండదురా ఈ సదువు సంగతే అంతరా. అయినా మనలాంటి కూడులేని పేదోలు సదూకుంటే ఎలా సెప్పరా. అయినా దసరా దశమినాటికి నీకో కొత్త సొక్కా కొంటాలేరా!" వాడిలో ఆశల బీజాన్ని నాటాడు.

అసిరిగాడు ఏం మాట్లాడలేదు.

"నాకు సొక్కా ఎందుగ్గాని బడిలోకి పంపిస్తే సక్కా సదూకుంటానయ్యా!"

ఎరకయ్య ఏం మాట్లాడకుండా మౌనం వహించాడు.



పూరి గుడిసెలోంచి చూస్తుంటే దూరంగా చెరువు గట్టు గట్టు దిగువన పాలాలు కన్పిస్తున్నాయి. గట్టుమీద చిన్న చిన్న కాలేజీలు పట్టుకుని వదుంమీద బేగులు తగిలించుకుని నవ్వుతూ గెంతుతూ పట్నంలో బడికి వెళ్తున్న పిల్లలు కనిపిస్తున్నారు.

స్కూలుకి టైమయింది కాబోలు అనుకున్నాడు ఎరకయ్య.

పట్నంలో వున్న బడికి వెళ్లడానికి రోజూ నడిచే వెళుతుంటారు. పిల్లలందరికీ బడికెళ్లడం పెద్ద సరదా కాబోలు. రోజూ పనీపాటా లేకుండా బడికెళ్లే ఈళ్లని చూసే కాబోలు బడికెళ్తానని గొడవపెడుతున్నాడు అనుకున్నాడు.

బడికి వెళ్తున్న పిల్లల్ని చూశాడంటే మళ్లీ గొడవ రేకెత్తిస్తాడు. అందుకే గేదెల్ని కాయడానికి పురమాయించాలని లేచి నిలబడ్డాడు. ''అసిరీ. ఒరే అసిరీ'' పిలుపుకి ప్రతిస్పందన కన్పించలేదు.

'ఎక్కడికి పోయాడబ్బా' అనుకుంటూ ఎరుకయ్య గుడిసె బైటికి వచ్చాడు. గుడిసె ప్రక్కన చెట్టు నీడలో నిల్చున్నాడు. వాడి చూపుల్లో ఆశ. ఆకాంక్ష. ఆ చూపులు అంతమయ్యేచోట బడికి గుంపుగా వెళ్లే పిల్లలు.

o p o

పొలం పనులనుంచి ఒక్కొక్కళ్లే వస్తున్నారు.

కూలి డబ్బులందుకుని ఎరకయ్య పల్లెలోకి వచ్చాడు.

గుడిసెల్లో పిల్లలు గుంపులు గుంపులుగా చేరి రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు. అసిరిగాడు వున్నాడనుకుని తేరిపార చూసినా కన్పించలేదు.

గుడిసెలో దూరంగానే అసిరిగాడి మాటలు విన్పించాయి.

''పైన ఆడుకోరా ఈడకెందుకొచ్చావు?'' అసిరిగాడితో సన్నమ్మ అంటోంది.

''అదికాదమ్మా!''

''ఏందిరా! నసుగుతావు?''

''నాను సదూకుంటానే''

'ఇక్కడకూడా తయారయ్యాడు గాబోలు' అనుకుని కుక్కిమంచంలో కూలబడ్డాడు ఎరకయ్య.

''సదూకుంటే మనకి పనులెవరు చేస్తారా. నువ్వు సేసే పనికి కూలీని పెట్టుకోవాలి. అయినా అయ్యని అడగరా నన్నెందుకడుగుతావు?'' అంది.

''అయ్యని అడిగినాను. వద్దని గసురుకున్నాడు!''

''ఆడొద్దంటే నానేం సేసేదిరా?'' ప్రశ్నించింది.

''నాకు రోజూ బడికెళ్లి సదూకోవాలని వుందే!''

''సదువుకుని ఏం సేస్తావురా?'' సన్నమ్మ అడుగుతోంది.

అసిరిగాడు ఏం చెబుతాడా అని ఎరకయ్యకూడా చెవులు రిక్కించాడు.

''సదుకుని ఉద్యోగం సేస్తాను. ఎక్కువ డబ్బులు తెచ్చి నిన్నూ అయ్యని పోసిస్తాను. ఈ గుడిసె ఇంటిలోంచి పెద్ద ఇంటిలోకి పోదాం. కాన్వెంటులో సదూతున్న పోస్టుమేన్ కొడుక్కంటే నేను బాగా ఇంగిలీసు మాటాడేస్తాను'' ఉత్సాహంగా చెప్పుకు పోతున్నాడు.

ఎరకయ్య ఆలోచనలో పడ్డాడు. దినదిన కష్టంతో రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడితేనే కడుపు నిండడం లేదు. బడి ఫీజులకు బండెడు పుస్తకాలకి అయ్యే ఖర్చుని తను భరించగలడా. అయినా అసిరిగాడి సాయం లేకపోతే పనులెవరు చేయగలరు.

ఆ మాటలు చెప్పి అసిరిగాడు బైటికి

పోయాడు.

ఆ తర్వాత

"ఒసే పన్నమ్మో...?" పిల్చాడు ఎరకయ్యా.

పన్నమ్మ లోపల్నుండి వచ్చింది.

"ఏంటే? ఆసిరిగాడి సదూగురించి మాటాడుతున్నావు?"

"ఆడు సదూకుంటాడంట. పదివియ్యగూడదూ?"

"నీకు బుద్ధిలేదేంటే?"

"ఏం?"

"ఆడికి సదువెందుకే! అయినా పూటకి గతిలేని మనలాంటోళ్లకి సదువు రాదే. నాకు తెలీకడుగుతాను. ఆడ్ని పదివిస్తే ఏం ఒరిగిపోతుందే?"

"ఆడు ఉద్దోగం సేసి మనల్ని పోసిస్తాడంట!"

ఎరకయ్య పడీ పడీ నవ్వాడు.

పన్నమ్మ బిత్తరపోయి చూస్తోంది.


"ఆడు మనల్ని పోసిస్తాడు. ఏలెదు లేదు ఆడికి సదువేంటే. ఒకేల కష్టపడి ఆడ్ని పదివించినా ఎంత సెప్పు నాలుగ్గచ్చరం ముక్కలు. ఆ తర్వాతాడ్ని పదివించడం మావలేం. ఆ పాటికే ఆడికుజ్జోగం వొచ్చేయడం, మనల్ని పోసించేయడం... అయినా ఈ కాలంలో సదూకున్నోళ్లకి ఉద్యోగాల్లేవు... నా మాటిని ఆడి దగ్గర సదువు వూసెత్తకు. వచ్చే ఉదుపుల కాలానికి ఆడు సేతికి అందొస్తే మనం కడుపునిండా తిండి తినగలం."

ఎరకయ్య మాటలు పన్నమ్మ మీద పనిచేశాయి.

"నీ ఇట్టం!" లోపలికి వెళ్లింది.

మూరుమన్న పొగాకు కాడని లాగి దులిపి చుట్టగా చుట్టి నోట్లో పెట్టి అగ్గిపుల్ల వెలిగిస్తూ ఎరకయ్య గుడిసె పక్కకి చూశాడు.

బెదురుచూపులు చూస్తూ ఆసిరిగాడు.



'ఆడుకోడానికి ఎల్లకుండా గుడిసె పక్క న్నిల్చొని ఆలకిస్తున్నాడన్నమాట' అనుకున్నాడు ఎరకయ్య.

''ఇలా రారా అసిరీ!''

భయపడుతూ దగ్గరకు వచ్చాడు.

''అయ్యా! నన్ను పనిలో ఎట్టేస్తావా?'' దిగులుగా అడిగాడు అసిరిగాడు.

''సదువు సంగతి ఎత్తకుండా వుండు. మంచి బట్టలు కొంటాను. పట్నానికి తీసుకుపోయి అన్నీ సూపిస్తాను!'' మరి జవాబుకి అవకాశం లేకుండా చుట్ట పీలుస్తూ బైటికి వెళ్లిపోయాడు.

o p o

ఎరకయ్య పొలం గట్టుమీద నడుస్తున్నాడు. వెనుక అడుగులో అడుగువేస్తూ అసిరిగాడు అనుసరిస్తున్నాడు.

బుగత మధ్యాహ్నం సరిగా పనిచేయనందుకు తిట్టిన తిట్లే ఎరుకయ్యకి గుర్తుకొస్తున్నాయి. ఏం తప్పు చేయకుండా ఎందుకంతలా తిట్టాడో అర్థం కావడంలేదు.

ఎదురుగా బడిపిల్లలు పుస్తకాలతో ఎదురయ్యారు.

బడి అయిపోయిందిగాబోలు. ముఖాలు వేలాడేసుకుని ఖాళీ కేరేజీలను వూపుకుంటూ ఒకరితో ఒకరు కబుర్లాడుకుంటూ వస్తున్నారు.

దగ్గరకు వచ్చిన తర్వాత వారే గట్టు దిగి దాటిన తర్వాత తిరిగి పొలం గట్టెక్కి సాగిపోయారు.

అదే ఈడులో వున్న అసిరిగాడు వారు వెళ్తున్నవైపే చూస్తుండిపోయాడు.

''అయ్యా! నాకు పిల్లరు కారేజి కొంటావా స్టీలు కారేజి కొంటావా?'' యాధృచ్ఛికంగా అడిగాడు.

''ఏ కేరేజి?'' పరధ్యానంగా అడిగాడు ఎరకయ్య.

''నా బడి కేరేజి!''

''ఏందిరా! అంటున్నావు?''

''అయ్యా! బడికి ఎల్తానయ్యా. కేరేజి తీసుకుని ఎల్తానయ్యా!''

ఎరకయ్యలో కోపం కట్టలు తెంచుకుంది.

పెద్ద రైతుమీద కోపం అసిరిగాడిమీద మళ్లింది.

''నోరుముయ్యరా అసిరిగా! మరోసారి బడి మాటెత్తావంటే మక్కెలిరగదంతాను. నీకు బుద్ధిలేదేంటిరా గాడిదకొడకా?''

ఇంటికి వచ్చినవరకూ అసిరిగాడు మాట్లాడలేదు.

తన వయస్సు పిల్లలందరూ బడికి ఎల్తుంటే తనని పంపడానికి అయ్యెందుకు గింజుకుపోతున్నాడో అర్థం కావడంలేదు. పనులు మాని సదువుకోవాలని అనుకోవడం తప్పా. అందరూ ఎందుకిలా అంటున్నారో తెలీడంలేదు. అసిరిగాడిలో ఆలోచనలు.

o p o

వారం రోజులనుంచి అసిరిగాడు ముభావంగా వుంటున్నాడు. చెప్పిన పనల్లా చేస్తూ దేనికీ రెట్టించడంలేదు.

తమ తిట్టిన తిట్లు వాడిమీద ప్రభావం చూపించాయని ఎరకయ్య సంతోషించాడు.

పొలంలో కూలి పనిలో కలుపు మొక్కలు తీస్తున్న ఎరకయ్యకి దూరంగా చిన్న చిన్న అడుగులేసుకుంటూ వస్తున్న వాడ్ని చూస్తే అసిరిగాడని తెలిసిపోయింది.

''అయ్యా!'' వాడే పిల్చాడు.

''ఏందిరా అసిరీ! ఇలా వచ్చావు!''

''వూర్లోకి సైకిళ్లమీద వచ్చి గోడలమీద కాయితాలంటించారయ్యా! అందరూ సదువుకోవాలని అందులో రాశారంట. పెద్దోళ్ల రాత్రిబళ్లోను, పిల్లలు బడికెళ్లి సదువుకోవాలంట!''

''అయితే ఏంటి?''

''అయ్యా! బడికెళ్లి నాకు సదూకోవాలని వుందయ్యా! నువ్వు తిట్టినకాడ్నించి రోజూ ఏడుస్తున్నానయ్యా! బడంటే ఎందుకంత మండిపడతావు!''

''వద్దన్నాను గదరా!''

కూలీలు ఎవరి పనుల్లో వారున్నారు. అసిరిగాడి మాటలు ఎరకయ్యలో విసుగు కలిగిస్తున్నాయి.

''అవుననుకో! అయినా అందరి పిల్లల్లా నాకూ బడికెళ్లాలని సదువుకోవాలని వుందయ్యా! మనింటి పక్కనున్న సూరిగాడుకూడా బళ్లో జాయినవుతాడంట!''

''మనూర్లో బడి వేదు. సదూకోవాలంటే రోజూ నడిచెల్లాలిరా!'' అన్నాడు ఎరకయ్య.

''ఎల్తానయ్యా! సదువుకోసం ఎంత దూరమైనా ఎల్లగలను''

ఎరకయ్యకి ఎంతో విసుగు కలిగింది.

చదువన్నది అసిరిగాడికి అవసరం లేదని ఇంటి పరిస్థితులు బాగు లేనప్పుడు అందరూ పనిచేస్తే తప్ప పూట గడవనప్పుడు ఎవరో బడికెళుతున్నారని తాను వెళ్లడం అనవసరం. ఎరకయ్యలో ఆలోచనలు.

''అయ్యా!'' మళ్లీ అందుకున్నాడు.

ఎరకయ్య విన్పించుకోలేదు.

''అయ్యా!''


పీకవరకూ కోపం తన్నుకొచ్చింది ఎరకయ్యకి. గొంతునులిమి చంపేయాలనుకున్నాడు. ఇష్టంలేని విషయం పదేపదే చెప్పడంతో అదోలాంటి అసహనం ఏర్పడింది. ఎన్ని

## రోడ్డు

''2000 సంవత్సరానికి మన దేశంలో 150 కోట్ల కార్లుంటాయట!'' అన్నాడు వంశీ.

''అయితేనప్పుడు రోడ్లు దాటాలనుకునేవాళ్లంతా ఇప్పుడే దాటేస్తే మంచిది!'' అన్నాడు సురేష్.

— పి.వి.మురళీకృష్ణ (హైదరాబాద్)



రకాలుగా చెప్పినా వినడంలేదు. దండోపాయ మొక్కటే పరిష్కారమార్గం అనుకున్నాడు.

పక్కమన్న కూలీకి పని అప్పగించాడు.

పొలంలోంచి బైటికి వచ్చి చేతులు కాళ్లు కడుక్కుని పైమన్న అసిరిగాడి దగ్గరికి వచ్చాడు.

"మా అయ్య ఎంతో మంచోడు!" తన చదువు విషయంలో ఇంత కాలానికి తండ్రి కరుణించాడని సంతోషించాడు. తన గురించి అయ్య పని వదిలిపెట్టి మరీ వచ్చేసేడంటే వాడి చిన్న మనసుకెంతో ఆనందంగా వుంది.

"పదరా!"

అనుసరించాడు అసిరిగాడు.

ఇల్లు పొలానికి కనుచూపు మేర దూరంలో వుంది. ఇంటికి చేరే సరికి పైన గొళ్లెం వేసి వుంది. అంటే సన్నమ్మ కూలిపనినుంచి ఇంకా రాలేదన్నమాట. తాటి తోపుల్లో వుండే గడ్డిని కోసి పశువులున్నోళ్లకి అమ్ముతుంది. "మీ అమ్మ ఏడకెళ్లిందిరా?" తెల్సినా అడిగాడు ఎరకయ్య.

"గడ్డికెళ్లిందయ్యా!"

తలుపు గడియ తీసి ఎరకయ్య నిలబడ్డాడు. దానికి ఒకటే ద్వారం.

అసిరిగాడు అయోమయంగా చూస్తున్నాడు.

"ఎల్లరా లోపలికి!"

అసిరిగాడు గబుక్కున లోపలికెళ్లాడు.

"కూలిపని పేసుకుంటున్న వన్ను పదువు పదువు అని పంపుతావురా గుంట ఎదవా. మన ఇంటావంటా లేవిది పీకెందుకురా పదువు. ఒకసారి సెప్పినప్పుడు ఇనుకోవాలా" చాచిపెట్టి లెంపకాయ కొట్టాడు ఎరకయ్య.

బిత్తరపోయాడు అసిరిగాడు.

"ఈ గదిలో పడి వుండు. అయినాక అమ్మ వచ్చినప్పుడు బువ్వ తిందువుగాని!" కోపంగా అని విసురుగా తలుపు లాగి గొళ్లెం పెట్టాడు.

ఆ గదికి కిటికీలుకూడా లేవు.

"అయ్యా! అయ్యా! ఇందులో నేనేం సేయాల. నాకు భయమేస్తుందయ్యా!" అరుస్తున్నాడు లోపలినుంచి అసిరిగాడు.

"అందులోనే సదువుకోరా! బొగ్గుముక్కల్తో నేలమీద రాసుకుని సదువుకోరా గుంటనాకొడకా!" వెటకారంగా అంటూ పొలంవేపు సాగిపోయాడు ఎరుకయ్య.

ఈ బెదిరింపుతో అసిరిగాడు పూర్తిగా మారిపోతాడు. ఓ గంటవరకు ఈ బాధ అనుభవిస్తే చదువు సంగతి మరెత్తడు. చదువుకోవాలంటే డబ్బులుండాల. బట్టలుండాల. పుస్తకాలుండాలి. పై వూర్లో చదవాల. చేస్తున్న పనులు మానుకోవాలి. ఇన్ని కష్టాలతో పేదవాళ్లకి చదువెందుకు" ఆలోచిస్తూ పొలం పనిలో మునిగిపోయాడు ఎరకయ్య. చదువుపట్ల పూర్తి విముఖతతో లొంగిపోతాడన్న నమ్మకాన్ని ఏర్పర్చుకున్నాడు.

o p o

అర గంట తర్వాత అరుపులు విన్పించాయి. పొలంలో కూలి పనులు చేస్తున్నవారంతా చూశారు.

దూరంగా మంటలు కన్పించాయి. ఈ

రు కాలిపోతున్నదని ఎవరో చెప్పారు.

ఎవరిపనులు వారు వదిలి వూరువైపు పరుగులు తీశారు. అందరితోబాటు ఎరక య్యకూడా ముందుకు ఉరికాడు.

కూలీలు వుంటున్న గుడిసెలన్నీ తగలబడిపోతున్నాయి. గాలి ఎక్కువగా వుండడంవల్ల మంటలు ఎక్కువగా వస్తున్నాయి. ఎవరి సామాన్ల రక్షణలో వారున్నారు.

ఎరకయ్య గుడిసెవైపు పరుగుపెట్టాడు. పూర్తిగా. పైకప్పు కాలిపోయింది. లోపల అసిరిగాడి అరుపులేమీ విన్పించడంలేదు. పైకి వచ్చేశాడేమో అనుకున్నాడు. కానీ గంటముందు అతను వేసిన గొళ్లెం అదే విధంగా వుంది. విసురుగా గొళ్లెం తీశాడు.

తలుపు చెక్కలు కాలిపోయాయి.

లోపల అసిరిగాడు నేలమీద పడుకుని వున్నాడు. వాడి బట్టలన్నీ కాలిపోయాయి.

వెంటనే భుజంమీద వేసుకుని బైటికి పరుగెట్టుకుని వచ్చాడు. ఎరకయ్య భుజంమీద తల వాల్చేశాడు అసిరిగాడు.

పన్నమ్మ పరుగు పరుగున ఏడుస్తూ వచ్చింది.

అసిరిగాడ్ని కింద పడుకోబెట్టారు.

చల్లగాలి తగలడంతో కొద్దిగా కదిలాడు. ఎరకయ్య హృదయంలోంచి దుఃఖం తన్నుకొచ్చింది.

ఒక్కడే కొడుకైన అసిరిగాడ్ని చదువుకి విముఖుడ్ని చేయడం. కాని జరిగిందేమిటి? చొక్కా వద్దు చదువే కావాలని పదేపదే కోరిన అసిరిగాడికి ఇచ్చిన ప్రతిఫలం ఏమిటి ?

o p o

ఇప్పుడు — అసిరిగాడు బడికి వెళ్తాను. చదువుకుని పెద్దవాడ్నవుతాను అనడంలేదు.

చదూకోవాలన్న తన ఆసక్తికి అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తున్న అయ్య మనసుని మార్చమని అమ్మని పదేపదే అడగడంలేదు.

తన వయసోళ్లంతా ఎంతో ఉత్సాహంతో చదువుకోసం తీస్తున్న పరుగులనుకూడా పట్టించుకోవడంలేదు.

అగ్నిప్రమాదం అతడికి మాటరాకుండా చేయవచ్చు.

జీవచ్ఛవంలా తయారుచేయవచ్చు.

కదలలేని అనారోగ్యానికి గురిచేయొచ్చు.

అందరిలోనూ తిరగలేని అందవికారంగా చేయొచ్చు.

ఏదైనా జరగవచ్చు.

అందుకే —

అసిరిగాడు ఇప్పుడు ఏం చేయడంలేదు.

విస్తేజంగా పడుకుని శూన్యంవైపు చూస్తున్నాడు.

ఆ చూపులను చూస్తున్న ఎరకయ్యకి "అయ్యా నాను సదూకుంటాను. నాను సదూకుంటాను" అని వెంటపడి అభ్యర్థిస్తున్నట్టే వుంది.